# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :64 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 30-04-2024 | పేజీలు:4 వెల: 2.00


## కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో హమాలీల ఆందోళన

కేసముద్రం, ఏప్రిల్ 29: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిదిలో వ్యాపారులు బయట కొనుగోలు చేస్తున్న ఉత్పత్తులకు కూలీ రేట్లు చెల్లించాలని కోరుతూ హమాలీలు, దడువాయిలు సోమవారం మార్కెట్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈనేపథ్యంలో మార్కెట్ కార్యాలయంలో ప్రత్యేక హెూదా కార్యదర్శి అమరలింగేశ్వర్ రావు అధ్యక్షతన ఛాంబర్ ఆఫ్ కామర్స్ అద్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, వ్యాపారులు, దడువాయి సంఘం, హమాలీలు, ట్రెడ్ యూనియన్ నాయకుల సమక్షంలో సమవేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. మార్కెట్ లో వ్యాపారులు కోనుగోలు చెసే దానికంటే బయట మిల్లులు, ట్రేడింగ్ కంపెనీల వద్ద వేబ్రిడ్జిలో తూకం వేస్తు దడువాయిలకు, హమాలీలకు పని కల్పించకుండా వారి కడుపు కొడుతూ కొనుగోళ్ళు చేస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్ లో కోనుగోలు చేసిన ఉత్పత్తులకు వ్యాపారులు దడువాయిలకు, హమాలీలకు ఇచ్చే కూలీ మాదిరిగానే మిల్లులు, ట్రేడింగ్ కంపెనీల వద్ద కోనుగోలు చేసిన ఉత్పత్తులకు కూడ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# మళ్లీ భావోద్వేగాల రాజకీయమేనా కేటీఆర్?



హైదరాబాద్,చింతచచ్చినా పులుపు చావలేదని సామెత. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో సహా ఆ పార్టీకి ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టినా ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి రాలేదనే టాక్ నడుస్తోంది. ఇప్పుడు లోక్ సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. బీఆర్ఎస్ అసలు పోటీలోనే లేదని అంటున్నారు. 17 లోక్ సభ స్థానాల్లో కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోటీ ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలో కాస్తో కూస్తో ఉనికి చాటుకోవడానికి బీఆర్ఎస్ నేతలు మళ్లీ భావోద్వేగ రాజకీయాలు మొదలుపెట్టారని టాక్ నడుస్తోంది. ఇందులో భాగంగానే హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేసీఆర్ తనయుడు కేటీఆర్ కొత్త పల్లవి అందుకున్నారు. భావోద్వేగ ప్రకటనలతో ప్రజలను రెచ్చగొట్టడం ద్వారానే బీఆర్ఎస్ ఎన్నికల్లో లబ్ధి పొందుతూ వచ్చిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. నీళ్ల, నియామకాలు, నిధులు అంటూ నినాదం మొదలుపెట్టి.. ఆంధ్రులు వీటన్నింటిని దోచుకుని తెలంగాణకు అన్యాయం చేస్తున్నారంటూ ప్రజల్లో విషబీజాలు నాటారని చెబుతున్నారు. 2014 ఎన్నికల్లో ఇదే భావోద్వేగ రాజకీయాలు చేసి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిందని గుర్తు చేస్తున్నారు. ఇక 2018లో కాంగ్రెస్, టీడీపీ పొత్తు పెట్టుకోవడంతో ఈ కూటమి గెలిస్తే చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని.. తెలంగాణ ను ఆంధ్రాలో తిరిగి కలిపేస్తారంటూ విష ప్రచారం చేసి బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిందని గుర్తు చేస్తున్నారు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కూడా బీఆర్ఎస్ ఇలాగే భావోద్వేగ రాజకీయ కుట్రకు తెరతీసిందనే ఆరోపణలున్నాయి. ఆంధ్రాలో కేసీఆర్ మిత్రుడైన వైఎస్ జగన్ అధికారంలో ఉండటంతో ఆయన సహకారంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టుపైకి ఏపీ పోలీసులను పంపి డ్యామ్ ను ఆక్రమించుకోవడానికి ఏపీ ప్రయత్నిస్తోందంటూ డ్రామా ప్లే చేయడానికి బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారని అంటున్నారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలంటే కేసీఆర్ అధికారంలో ఉంటేనే సాధ్యమవుతుందని ప్రజలు దీన్ని నమ్మాలన్నట్టు గేమ్ ఆడారని చెబుతున్నారు. అయితే కేసీఆర్ డ్రామాలను అర్థం చేసుకున్న ప్రజలు ఆయనకు కర్రుకాల్చి వాత పెట్టారని గుర్తు చేస్తున్నారు. అయినా బీఆర్ఎస్ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని టాక్ నడుస్తోంది. అందుకే ఇప్పుడు మళ్లీ ప్రశాంతంగా బతుకుతున్న ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే లక్ష్యంగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని టాక్ నడుస్తోంది. ఇందులో భాగంగానే హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతం చేస్తారని.. ఇందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని చెబుతున్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర అవసరాలు తీరకముందే నదుల అనుసంధానం పేరిట గోదావరి జలాలను ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. వీటిని అడ్డుకునే శక్తి ఒక్క బీఆర్ఎస్ కే ఉందని గొప్పలు పోయారు. అత్యధిక సంఖ్యలో ఎంపీలను బీఆర్ఎస్ కు గెలిపించాలని ప్రజలను కోరారు. అయితే కేటీఆర్ భావోద్వేగాల వలలో ప్రజలు చిక్కుకునే అవకాశమే లేదంటున్నారు. ఇందుకు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమంటున్నారు.

# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న గుత్తా కుమారుడు..

హైదరాబాద్ : తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీని వీడి మరో నేత కాంగ్రెస్ పార్టీలో చేరారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్ పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. నేడు అమిత్ ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని కలిశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు గుత్తా అమిత్. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో అమిత్ కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇటీవల కాలంలో గుత్తా సుఖేందర్ కూడా పార్టీపై ధిక్కార స్వరం వినిపించారు. అధినేత కేసీఆర్, నాయకుల తీరును తూర్పారబట్టారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ అపాయింట్‌మెంట్ కోసం ఆరు నెలలు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని, తనకే అలాంటి పరిస్థితి



ఏర్పడిందంటే మిగతా వారి పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని, ఓటమిపై ఇప్పటి వరకు సమీక్ష చేయలేదని మండిపడ్డారు.. దీంతో ఆయన కూడా పార్టీ మారుతారన్న ప్రచారం జరిగినప్పటికీ ఆయన దానిని కొట్టిపడేశారు. కాని ఆయన కుమారుడు కాంగ్రెస్‌లో చేరారు.

# కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి...ఎంపీ అభ్యర్థి నీలం మధు



మెదక్ :మెదక్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు సోమవారం సంగారెడ్డిలో మార్నింగ్ వాక్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ బ్యాక్ సైడ్ పార్క్, తార ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్ కు చేరుకున్న నీలం మధు తెలంగాణ ఇండస్ట్రియల్ చైర్మన్, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డితో కలిసి వాకర్లు, సీనియర్ సిటిజెన్లు, రిటైర్డ్ ఎంప్లాయిస్, యువతను కలిసి పలకరించారు. వారితో కలిసి ఆయన వాకింగ్ చేశారు. షటిల్, క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. యోగ నిర్వాహకులతో కలిసి కాసేపు యోగా చేశారు. ఈ సందర్భంగా వాకింగ్ ట్రాక్ లు, ఇండోర్ ప్లేగ్రౌండ్స్ అవసరం చాలా ఉందని నీలం మధుకు వారంతా ఎంపీ అభ్యర్థి నీలం మదుకు విన్నవించారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి..

కాంగ్రెస్ పార్టీ హయాంలోని సంగారెడ్డి ప్రాంతం అభివృద్ధి జరిగిందని తనను కలిసిన వాకర్లు చెబుతున్నారని నీలం మధు తెలిపారు. వాస్తవానికి దేశం మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ హయాంలోనే బీడీఎల్బీహెచ్ఎల్ ఈక్రిసాట్ వంటి గవర్నమెంట్ సెక్టార్లన్నీ మెదక్ జిల్లాలో నెలకొల్పడం జరిగిందని గుర్తు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ విప్ గా ఉన్న జగ్గారెడ్డి స్థానికంగా ఐఐటి తీసుకురావడమే కాకుండా కలెక్టరేట్ బ్యాక్ సైడ్ గ్రౌండ్ కోసం కృషి చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న పాటుపడుతోందన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని, రాహుల్ గాంధీ నేతృత్వంలో పాంచ్ గ్యారెంటీలను అమలు చేసి తీరుతామన్నారు. యువత ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. తాను ఎంపీగా గెలిచాక ఎంపీ, సీఎస్ఆర్ ఫండ్స్ తో వాకింగ్ ట్రాక్ ల అభివృద్ధి, ఇండోర్ స్టేడియంలో ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అనంత కిషన్, పోతిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పెప్పీ శేఖర్, విద్యానగర్ కాలనీ అద్యక్షుడు గెల్లి వెంకటేశం, సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జార్జ్, కిషన్ ఆంజనేయులు, ఉదయభస్కర్, కిరణ్ గౌడ్, లక్ష్మణ్, సంతోష్, సతీష్, యాదగిరి పాల్గొన్నారు.

సంగారెడ్డిలో..చిరు వ్యాపారులను కలిసిన నీలం మధు..

మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు సోమవారం సంగారెడ్డి జిల్లా కేంద్ర లోని మార్కెట్లో ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ఇండస్ట్రియల్ చైర్మన్, సంగారెడ్డి డిసిసి అధ్యక్షులు నిర్మల జగ్గారెడ్డితో కలసి ఉదయం మార్కెట్ కు చేరుకున్న నీలం మధు చిరు వ్యాపారులను పలకరించారు. ఈ సందర్భంగా ఆయన కూరగాయలు, పండ్లు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు వారి సాధక బాధలను నీలం మధుతో చెప్పుకున్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలు వినియోగించుకుంటున్నారా ? అని నీలం మధు వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మరిన్ని సంక్షేమం పథకాలు అమలుకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ ఎన్నికలలో తనను అధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జార్జ్, కిషన్ ఆంజనేయులు, ఉదయభస్కర్, కిరణ్ గౌడ్, లక్ష్మణ్, సంతోష్, సతీష్, యాదగిరి పాల్గొన్నారు.

# లేడీ ఫైర్ బ్రాండ్ దెబ్బకు కిషన్ రెడ్డికి భారీషాక్ రెడీ?

హైదరాబాద్,అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చి తన మాటలతో జాతీయ స్థాయిలో హాట్ టాపిక్ గా మారారు హైదరాబాద్ ఎంపీ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాధవీలత. సొంత కార్పొరేట్ ఆసుపత్రి.. వ్యాపారాలు.. సేవా కార్యక్రమాలు.. హిందూయిజం గురించి.. హిందూ ధర్మం గురించి ఆమె చెప్పే మాటలు.. వినిపించే లాజిక్కులు అందరిని ఆకర్షిస్తున్నాయి. అన్నింటికి మించి హైదరాబాద్ లోక్ సభా స్థానంలో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ తప్పించి మరెవరూ ఎందుకు గెలవరలేరన్న అంశంపై ఆమె ప్రస్తావించిన అంశాలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు బీజేపీలో మాధవీలత హాట్ టాపిక్ గా మారారు. జాతీయ స్థాయి నేతలు సైతం ఆమెతో మాట్లాడేందుకు ఆసక్తిని చూపుతున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. ఈ ఎన్నికల్లో ఆమె ఓటమి ఖాయమైనప్పటికీ.. ఆమె రాజకీయ భవిష్యత్తు మాత్రం దివ్యంగా ఉంటుందన్న వాదన పెరిగింది. అన్నింటికి మించి.. మాధవీలత పుణ్యమా అని కిషన్ రెడ్డికి తొలి షాక్ తగులుతుందని చెబుతున్నారు. తెలంగాణలో బీజేపీ ఎదగకపోవటానికి.. బలమైన నాయకుడు రాకపోవటానికి కారణం.. కిషన్ రెడ్డి.. డాక్టర్ లక్ష్మణ్ తో పాటు మరికొందరన్న ఆరోపణ ఉంది. బండి సంజయ్ నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ ఒక స్థాయికి తీసుకొచ్చారని.. కారణం ఏమైనా.. ఆయన్ను పక్కన పెట్టేయటంతో పార్టీ గ్రాఫ్ పడిపోయిందన్న వాదన తెలిసిందే. రానున్న రోజుల్లో తెలంగాణ బీజేపీకి మాధవీలత ఫేస్ గా మారతారని చెబుతున్నారు. వివిధ అంశఆల మీద ఆమెకున్న పట్టు.. హిందీ.. ఇంగ్లిష్.. తెలుగు.. ఇలా అది ఇది కాదన్నట్లుగా పలు భాషల మీద ఉన్న ప్రావీణ్యం ఆమెకు కలిసి వస్తుందంటున్నారు. హార్డ్ కోర్ హిందుత్వ అన్నట్లు కాకుండా.. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే నేర్పు.. విషయాన్ని నెగిటివ్ గా కాకుండా పాజిటివ్ గా చెప్పి కన్వీన్స్ చేయటం ఆమెకున్న సానుకూలాంశాలుగా చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మాధవీలత ఓటమి



ఖాయమని.. ఆమె గెలిస్తే మాత్రం అద్భుతమని చెబుతున్నారు. ఆమె పుణ్యమా అని.. హైదరాబాద్ పాతబస్తీలో మజ్లిస్.. ఎంబీల మధ్యనున్న శత్రుత్వం కరిగిపోవటమే కాదు.. ఓవైసీ గెలుపు కోసం ఎంబీటీ పోటీ నుంచి తప్పుకోవటం మాధవీలత నైతిక విజయంగా అభివర్ణిస్తున్నారు. అంతేకాదు.. అసద్ కు వచ్చే రెగ్యులర్ మెజార్టీ ఈసారి గణనీయంగా తగ్గుతుందని.. అది కూడా మాధవీలత పుణ్యమేనని చెబుతున్నారు. మాధవీలతలోని సానుకూలాంశాల్ని పార్టీ జాతీయ స్థాయిలో వినియోగించుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే.. సార్వత్రిక ఎన్నికల్లో మాధవీలత ఓటమితో సంబంధం లేకుండా.. మోడీ సర్కారు ఏర్పడితే ఆమెకు కేంద్ర మంత్రిగా చోటు ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వాదన చిన్న.. చితకా స్థాయిలో కాకుండా పార్టీకి చెందిన జాతీయ స్థాయి నేతల మాటల్లో రావటం ఆసక్తికరమని చెప్పాలి. ఒకవేళ అదే జరిగితే.. కిషన్ రెడ్డికి ఎన్డీయే సర్కారులో చోటు దక్కదంటున్నారు. అదే జరిగితే..కిషన్ రెడ్డికి మాధవీలత షాకిస్తున్నట్లుగా చెప్పక తప్పదు. మరేం జరుగుతుందో చూడాలి.

# పెన్షన్ల పేరుతో శవ రాజకీయాలు..

కర్నూలు : పెన్షన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం శవ రాజకీయాలు చేస్తుందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం నేపథ్యంలో కర్నూలు జిల్లా గూడూరులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పెన్షన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. పెన్షన్లను నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ నేడు ప్రభుత్వం ఆధ్వర్యంలో బ్యాంకులో వేస్తామని అధికారులు ప్రకటించడం సరికాదన్నారు. ఇది ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించడమే అన్నారు. పింఛన్ల కోసం మండుటెండల్లో పండుటాకులను తిప్పడం సబబా అని ప్రశ్నించారు. పింఛన్ల నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామంటున్నారనీఇది ప్రభుత్వ కుట్రలో బాగమేన్నారు. ఈ కుట్రలు, కుతంత్రాల్లో అధికారులు కూడా భాగస్వామ్యం కావడం దురదృష్టకరమన్నారు. సిబ్బంది ఉన్నా ఇంటింటికి పింఛన్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఒక్కో వ్యక్తి 45 పింఛన్లు ఇస్తే సరిపోతుందని.. ఎన్నికల అధికారులు చెప్పినా వినే పరిస్థితి లేకుండా పోయిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కుంటి సాకులతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈనెపమును తమపై మోపి ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైసీపీ ప్రభుత్వం ఇలాంటి డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గులకరాయి డ్రామా ప్రజలు ఇప్పటికే తెలుసుకున్నారన్నారు. ఇప్పుడు తెరపైకి మరో డ్రామా చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. 45డిగ్రీల ఎండలో ఎక్కడో బ్యాంకులో వేస్తే సుధూర ప్రాంతాలకు వెళ్లి పెన్షన్ దారులు ఎక్కడ తెచ్చుకోగలుగుతారని ప్రశ్నించారు. ఈ ఎండలకు వెళ్తే.. వారికి ప్రమాదం పొంచి ఉందన్నారు. రేపు జరగరానిది జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా చనిపోయినా ఇది ప్రభుత్వ హత్యగా భావించాల్సి వస్తుందన్నారు. ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాలని తాము గట్టిగా డిమాండ్ చేశామన్నారు. %ొ%కానీ అధికార యంత్రాంగం ప్రభుత్వానికి వత్తాసు పలుకుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ తీరుతో గత నెలలో 33మంది వృద్ధులు ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ హత్యల్లో కొందరు అధికారులు భాగస్వాములయ్యారని మండిపడ్డారు. ఒక పార్టీ ప్రలోభాల కోసం అధికారులు పనిచేయడం తప్పు అని చంద్రబాబు ఖండించారు. ఇంటి వద్ద పెన్షన్లు పంపిణీ చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పంచాయతీ పరిధిలో ఒక్కో ఉద్యోగి 45 మందికి మాత్రమే పెన్షన్ ఇస్తాడన్నారు. పంచాయతీ



ఆఫీసుల్లో ఇచ్చేదే ఇంటి వద్ద ఇస్తారు. ఇందులో తప్పేముంది ? అని చంద్రబాబు ప్రశ్నించారు. పెన్షన్ల నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామంటున్నారని, అయితే పెన్షన్ తీసుకునే అందరి దగ్గర ఫోన్లు ఉండవు కదా అని చంద్రబాబు ప్రశ్నించారు. బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అయ్యిందో లేదో ఎలా తెలుస్తుందని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామంటూ మరో కొత్త డ్రామాకు తెరదించామని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రభుత్వ యంత్రాంగం ఎంతో ప్రమాదకరమని, ఎన్నికల సంఘం కూడా చాలా అప్రమత్తం గా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగాలని ఆకాంక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత అన్ని పార్టీలు ఒక్కటేనని, అన్ని పార్టీలకు సమాన అవకాశాలు ఉంటాయని చంద్రబాబు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఒక్కడే ప్రభుత్వాన్ని, యంత్రాంగాన్ని వాడుకోవచ్చు. బస్సులు వాడుకోవచ్చు. గ్రౌండ్ వాడుకోవచ్చు అంటే కుదరదన్నారు. సభలకు బెదిరించి ఎక్కువ మందిని తీసుకురావొచ్చని అనుకుంటున్నారు. ఇవన్నీ జరగడానికి వీల్లేదన్నారు. కావున ప్రజలు వీటిని గుర్తించి ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని ఆయన సూచించారు.

## జలౌన్ సెషన్స్ కోర్టులో అగ్నిప్రమాదం

ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్ జిల్లా సెషన్స్ కోర్టు వెలుపల అగ్నిప్రమాదం జరిగింది. న్యాయవాదుల ఛాంబర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో లాయర్లు అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది.. సంఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నారు. పెద్ద ఎత్తున మంటలు అంటుకోవడంతో న్యాయవాదులకు చెందిన ఛాంబర్ దగ్ధమైంది.

# సీఎం రేవంత్ రెడ్డి కొత్త బిచ్చగాడిలా మాట్లాడుతున్నాడు



హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కొత్త బిచ్చగాడిలా మాట్లాడుతున్నాడని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి విమర్శించారు. మత, కుల పరమైన చిచ్చు పెట్టేలా వ్యవహరిస్తున్నాడు అని ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాణి రుద్రమదేవి మీడియాతో మాట్లాడారు. భారతదేశంలో చిచ్చుపెట్టేందుకు టెర్రరిస్టుల తరహాలోనే రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వీడియో మార్ఫింగ్ చేసి ఆయన రిజర్వేషన్‌లను రద్దు చేస్తామని అనని విషయాన్ని అన్నట్టు రేవంత్ రెడ్డి తన ప్రసంగాల ద్వారా, కాంగ్రెస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా ద్వారా అబద్ధాలు ప్రచారం చేస్తూ మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెట్టి తీవ్రవాదిలాగా దేశ ద్రోహానికి పాల్పడుతున్నాడు అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలి కానీ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల్లో భయాందోళనలు సృష్టించి విద్వేషాలు రగుల్చుతున్నాడు. కాంగ్రెస్ అధికారిక ఎక్స్ అకౌంట్ అమిత్ షా, బండి సంజయ్ మాటలను వక్రీకరించి పోస్ట్ చేస్తున్నారు. రాష్ట్రంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు.

రేవంత్ రెడ్డి బుడ్డర్ ఖాన్ తరహాలో వ్యవహరిస్తున్నారు. అంబేద్కర్‌ను ఏనాడైనా కాంగ్రెస్ పార్టీ గౌరవించిందా..? మంత్రి పదవికి బలవంతంగా అంబేద్కర్ చేత రాజీనామా చేయించి%ొ% ఆ తరువాత ఎన్నికల్లో నిలబడితే ఓడించింది కాంగ్రెస్ పార్టీ అని రుద్రమదేవి గుర్తు చేశారు. ఆరు గ్యారెంటీ లు అమలు చేయకుండా మీ బలహీనతలు కప్పిపుచ్చుకోవడానికి అబద్ధాలు ప్రచారం చేస్తూ మతాలు, కులాల మధ్య చిచ్చు పెడుతున్నాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డిది టీడీపీ డీఎన్ఏ. గతంలో లాఠీలను పట్టుకుని పోలీసులను తరిమిన వ్యక్తి అసదుద్దీన్ ఓవైసీ. అలాంటి వ్యక్తితో రేవంత్ రెడ్డి దోస్తానా చేస్తున్నారు. బీసీల వాటా రిజర్వేషన్ బీసీలకు ఇచ్చేందుకు పోరాటం చేస్తుంది బీజేపీ. ఇదే ఫేక్ ప్రచారంతో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది. మరోసారి అబద్ధాలు ప్రచారం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో గెలవాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడని రాణి రుద్రమదేవి మండిపడ్డారు.

# వైసీపీ గెలుస్తేనే పేదవాడికి న్యాయం జరుగుతుంది

అమరావతి,అమరావతిలో వైసీపీ పార్టీలో భారీ చేరికలు జరుగుతున్నాయి. ఇటీవల ముస్లిం మైనారిటీ సోదరులు భారీ ఎత్తున పార్టీలో చేరగా.. ఇప్పుడు కాపు సామాజిక వర్గానికి చెందిన 35 కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వయంగా కండువాలు కప్పి వారందరినీ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన అభివృద్ధికి, ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధికి తేడా చూడాలని కోరారు. కులం, మతం, పార్టీలు చూడకుండా అందరికీ అభివృద్ధితో పాటు సంక్షేమం అందించానని తెలిపారు. సీఎం జగన్ పాలనలో చేసిన మంచి, జరిగిన అభివృద్ధి చూసి ఎంతోమంది పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ అధికారంలోకి వస్తేనే పేదలకు సరైన న్యాయం సాధ్యమని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు చెప్పారు. మండల కేంద్రమైన అమరావతిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో అమరావతి మెయిన్ రోడ్ లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పేదల పార్టీ అని.. సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే వారికి సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. 2019లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగన్ నెరవేర్చారన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా మడమ తిప్పకుండా కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. అక్కచెల్లమ్మలకు ఆసరా కల్పించారని.. అన్నదాతలకు భరోసా ఇచ్చారని అన్నారు. అంతేకాకుండా.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలు బాగు చేసి భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నారని.. తాను కూడా 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చానని తెలిపారు.అటు.. అమరావతి %-% బెల్లంకొండ రోడ్డు, అమరావతి %-% తుళ్లూరు రోడ్డు, పెదమద్దూరు బ్రిడ్జి పూర్తి చేస్తున్నానని నంబూరు శంకరరావు చెప్పారు. అమరావతిలో రూ. 27 కోట్లతో సంక్షేమ పథకాలు అందజేశామని.. రూ. 23 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు ఆర్థికంగా బలపడదానికి సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు ఇస్తుంటే సోమరిపోతులను చేస్తున్నారని విమర్శించిన చంద్రబాబు.. ఇప్పుడు అవే సంక్షేమ పథకాలు ఇస్తామంటున్నారని విమర్శించారు. ఒకప్పుడు వాలంటీర్లను దొంగలతో పోల్చిన చంద్రబాబు.. ఇప్పుడు వారికి జీతాలు పెంచుతామంటున్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్ బాటలో నడుస్తూనే చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. మంచి చేసిన వారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని.. మరోసారి అవకాశమిస్తే రాష్ట్రానికి రోల్ మోడల్ గా మార్చి మీ చేతుల్లో పెడతానని చెప్పారు. సంక్షేమ పాలన కావాలంటే ఒక ఓటు తనకు, మరో ఓటు ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ కు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు.

# బాబు సరికొత్త ఎత్తుగడ

విజయవాడ :ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి విజయం ఖాయమని అంచనాల మీద అంచనాలు ఉరుకులు పరుగులు పెడుతుంటే%% క్షేత్ర స్థాయిలో మందగమనం వెక్కిరిస్తోంది. నిజానికి ఏపీలో బీజేపీ ఉనికే అంతమాత్రమే. కేడర్ కూడా అతి స్వల్పమే. దగ్గుబాటి పురందేశ్వరీ నాయకత్వంతో కాస్త ప్రచారం పెరిగిందే గానీ.. పోల్ మేనేజిమెంట్లో పూర్తిగా టీడీపీపైనే ఆధారపడక తప్పలేదు. ఇక్కడే తెలుగుతమ్ముళ్లు కాషాయ పార్టీతో జత కలవలేక.. ముందుకు వెళ్లలేక చతికిలపడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఆరు లోక్‌సభ స్థానాల్లో ఎన్ని గెలుస్తారో అంచనా లేదు. 10 అసెంబ్లీ స్థానాల్లోనూ ఇదే స్థితి. టీడీపీ నాయకుల్నే.. అటు జనసేన కండువాతో, ఇటు బీజేపీ కండువాతో బరిలోకి దించటంతో.. క్షేత్రస్థాయిలో ఇరుకున పడినట్టు తెలుస్తోంది. రాయలసీమ జిల్లాల్లో తమ వెంట రావొద్దని పసుపు సైనికులు కమల దండుకు నమస్కారం చేస్తున్నాయి. జమ్మల మడుగు, బద్వేలు, ధర్మపురి నియోజకవర్గాల్లో ఆయాచితంగా తమ సీట్లు కొట్టేశారని టీడీపీ శ్రేణులు గొల్లు మంటుంటే.. కోస్తాలో ఏకంగా బీజేపీలోకి పంపించటంతో అనపర్తిలో టీడీపీ కేడర్ చిన్నబోయింది. తమ నాయకుడు బీజేపీలోకి చేరటాన్ని తట్టుకోలేక పోతున్నారు. పవన్ కళ్యాణ్ త్యాగంతో భీమవరం సీటును టీడీపీ భుజాన జనసేన కండువ కప్పటంతో.. జనసేనలోనూ పైకి కనిపించని అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా అభ్యర్థుల ఎంపికలో కూటమి సరికొత్త పోకడ, ఎత్తుగడ ఏ ఫలితానికి దారి తీస్తుందో? వేచి చూడాల్సిందే.

అనపర్తిలో రామ రామ !

అనపర్తి సీటును బీజేపీకి త్యాగం చేయటం ఒక ఎత్తు కాగా.. టీడీపీ నేతను కమలనాథుడిగా మార్చటం మరోక ఎత్తుగడ. టీడీపీ అధినేత చంద్రబాబు వ్యూహం, ప్రతివ్యూహం ఎంత వరకూ ఫలిస్తుందో అర్థం కాని స్థితి. అనపర్తిలో 2014లో నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి టీడీపీ అభ్యర్థిగా 1,373 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో సీన్ మారిపోయింది. వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి 55,207 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి రేలంగి నాగేశ్వరరావు 11,769 ఓట్లు చీల్చటంతో రామకృష్ణా రెడ్డికి 55,564 ఓట్లే లభించాయి.

సూర్యనారాయణ రెడ్డికి 1,11,771 ఓట్లు వచ్చాయి. ఈ సీటును బీజేపీ అడిగింది. ఇక బీజేపీ అభ్యర్థి హరినారాయణ రెడ్డికి కేవలం 627 ఓట్లు వచ్చాయి. నోటాకు 2114 ఓట్లు వచ్చాయి. అంటే బీజేపీ కంటే మూడు రెట్ల ఓట్లు నోటాకు పడ్డాయి. ఇలాంటి స్థానంలో టీడీపీ అభ్యర్థి మళ్లీ గెలుస్తాడో లేదో? అనే అనుమానంతోనే ..ఈ సీటును బీజేపీకి అప్పగించారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పుడు రామకృష్ణారెడ్డిని బీజేపీకి సాగనంపటం వెనుక రాజకీయ ఎత్తుగడ ఎవ్వరికీ అర్థం కావటం లేదు. తెలుగుదేశం కార్యకర్తలు సైకిల్ గుర్తుకు కాకుండా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తారా? ఇంతకీ ఓటు బదిలీ జరుగుతుందా? లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ స్థితిలోనే రామకృష్ణా రెడ్డి పోటీ చేయాలా? వద్దా అనే మీమాంశలో పడ్డారని ప్రచారం జరుగుతోంది.

భీమవరంలో..త్యాగం ఫలించేనా?

ఓడిన చోటే గెలవాలనే ధ్యేయంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భీమవరంలోనే పోటీ చేస్తారని అందరూ భావించారు. అక్కడ తెలుగుదేశం నాయకుడు పులపర్తి రామాంజనేయులు త్యాగం చేయక తప్పదని భావిస్తే.. ఇక్కడ త్యాగం ఎదురు తిరిగింది. పవన్ కళ్యాణ్ పిఠాపురం వైపు ఎక్కువ మక్కువ చూపించారు. అంతే రామాంజనేయులును జనసేన శిబిరానికి టీడీపీ అధిష్టానం సాగనంపింది. ఇక్కడ డీడీపీ శ్రేణుల్లోనూ కాస్త మనస్థాపం తప్పలేదు. జనసేనలోనూ తమ నాయకుడిని కోల్పోయామనే వ్యథ తప్పలేదు. ఐతే, 2019 ఎన్నికల్లో గ్రంధి శ్రీనివాస్ 8 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ కు 62 వేల ఓట్లు, రామాంజనేయులుకు 54 వేల ఓట్లు పడ్డాయి. పవన్ కళ్యాణ్ ఇమేజీతోనే 62 వేల ఓట్లు రాగా.. ఈ సారి ఆయనకు బదులుగా అంత ఇమేజీ రామాంజనేయులుకు దక్కుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

# ఊపు తగ్గిన బిజెపి...ఉన్మాద వ్యూహాలు


న్యూఢిల్లీ,ప్రధానమంత్రి, బిజెపి సర్వాధినేత నరేంద్ర మోడీ ఇటీవల రాజకీయంగా మాట్లాడే మాటలు ఆయన రాజ్యాంగ రీత్యా బాధ్యతలకే గాక ఆ పార్టీ పరిధిని కూడా మించిపోతున్నాయి. అసలు ఒక పార్టీగానైనా ఒక ప్రభుత్వాధినేతగా అయినా ఆయన అవన్నీ మాట్లాడవలసిన అగత్యం లేకపోగా రాజ్యాంగం కనీసం తెలిసిన వారైనా జీర్ణించుకోలేని పరిస్థితి. నిజానికి మొదటి దశ పోలింగ్ సరళి మింగుడుపడకే మోడీ ఏదేదో మాట్లాడటానికి దేశంలో రాజకీయ చర్చను ఎక్కడికో తీసుకువెళుతున్నాడని పరిశీలకులు, మీడియా మొత్తంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయంలో బిజెపి అనుకూలమైన వారు కూడా ఆశ్చర్యాన్ని దిగమింగి ఏదోవిధంగా సమర్థించేందుకు తంటాలు పడుతున్నారు. రెండో విడత పోలింగ్ కూడా అందుకు పెద్దగా లేదని సమాచారం. కాబట్టి మోడీ విద్దూర వాక్కులు విజృంభించడమే గానీ తగ్గుముఖం పట్టవచ్చు. దీని ద్వారా ఆయన ఆశించే ప్రయోజనాలు రెండు: ఒకటి అలవాటైన మత రాజకీయాలను రగిలించడం, రెండోది తలా తోక లేని ఆరోపణలతో ప్రజల అయోమయానికి గురిచేయడం. మొదట ఆయన రాజస్థాన్‌లోని బాన్స్‌వారాలో ప్రసంగించారు. కాంగ్రెస్ గెలిస్తే మీ ఆస్తిపాస్తులు తీసుకుని ముస్లింలకు ఇచ్చేస్తానని భయపెట్టారు (దానిపై ప్రజాశక్తిలో ఇప్పటికే పలు వ్యాఖ్యలు వచ్చాయి). అది కాస్త బెడిసి కొట్టడంతో మొత్తం ఆస్తులకే ఎసరు అని కొత్తపాట అందుకున్నారు. ఇందుకు మద్దతుగా ఒకప్పటి ఆ పార్టీ సలహాదారు శ్యామ్ పిట్రోడా ఎప్పుడో చేసిన ఒక వ్యాఖ్యను తీసుకొచ్చారు. బాగా ధనాఢ్యులైన వారు ఆస్తిని వారసులకు అప్పగించి చనిపోతే వారి మరణానంతరం వారసత్వ పన్ను వేయొచ్చుననేది ఆయన ప్రస్తావించిన అంశం. అమెరికాలో 45 శాతం, జపాన్‌లోనైతే ఏకంగా 55 శాతం వున్న ఈ పన్ను ఆస్తి విలువ నుంచి మినహాయించుకుని ఇవ్వాలనేది ఆ చట్టాల సారాంశం. భారత దేశంలో అలాంటి చట్టం లేదు గానీ ఆర్థిక సమానత్వం, సమాజ ప్రయోజనాల కోసం ఆస్తిని తీసుకోవడం వంటి అంశాలు రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లోని 39(బి) పరిధిలోవి. దాని అమలుకు సంబంధించి 31(సి) యజమాని లేని ఆస్తులను లేదా అవసరమైన వాటిని తీసుకోవడానికి అవకాశమిస్తున్న మాట నిజం. అందుకు భిన్నంగా ఆస్తికి 19వ అధికరణం రక్షణనిస్తుంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ యుగంలో ఇవన్నీ తెర వెనక్కుపోయిన మాట నిజమేగాని ప్రాథమికంగా ఆ భావన తప్పు కాదు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయాకరణ వంటి సందర్భాల్లో ఈ రెంటికీ మధ్యనే చర్చ జరిగింది.

ఎందుకీ ప్రచారాలు? కోర్టులేమన్నాయ్?

కమ్యూనిస్టు ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్నప్పుడు దాన్ని దెబ్బ తీయడం కోసం ఆస్తులు లాగేసుకుంటారని పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి ప్రగతి నిరోధక శక్తులు. ఇందిరా గాంధీ కాస్త భూసంస్కరణలంటూ హడావుడి చేసిన సమయంలోనూ వీరంతా ఇదే విధంగా గగ్గోలు పెట్టారు. నిజానికి ఇప్పుడున్న అంతర్జాతీయ పరిస్థితిలో ప్రజల ఆస్తులు ప్రభుత్వాలే ప్రైవేటు పరం చేయడం పరిపాటిగా మారింది. మోడీ హయాంలోనే పెట్టుబడుల ఉపసంహరణ మంత్రంగా మారింది. ఇదే విశాఖ ఉక్కు వరకూ పాకింది. ప్రజాందోళనకు కేంద్రం స్పందించడం లేదు. ఈ విధంగా ప్రభుత్వ ఆస్తులు ప్రవేటు పరం చేయడంలో ముందున్న మోడీ వ్యక్తిగత ఆస్తులకేదో ముప్పు దాపురిస్తుందని భయపెట్టడం వంచనాశిల్పం మాత్రమే! హిందూ ముస్లిం తేడా లేకుండా మిగిలిన వారిని కూడా హడలగొట్టడంలో ఆయన ఆలోచన ఏమిటో వేరే చెప్పనక్కర్లేదు. ఆసక్తికరం ఈ సమయంలోనే సిజెఐంటే న్యాయమూర్తి చంద్రచూడ్ నాయకత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ సమస్యకు దారితీసింది. ముంబయి ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్ ఎప్పుడో వేసిన ఒక పిటిషన్‌ను దుమ్ము దులిపింది. ప్రజా ప్రయోజనాల కోసం ప్రైవేటు ఆస్తిని తీసుకోవడం ఆదేశిక సూత్రాల్లోని 39(బి) సారాంశం. ధర్మాసనంలోని న్యాయమూర్తి నాగరత్న సమీక్షలో కీలక వ్యాఖ్యలు చేశారు. సరళీకరణ యుగంలో ప్రైవేటీకరణకు ఇది విరుద్ధం కదా అని అడిగారు. తాను మార్క్సిస్టుల తరహాలో ఆస్తి పంపిణీ గురించి చెప్పడం లేదనీ, అయితే ఈ అంశానికి ప్రాధాన్యత ఉంటుందని ఆయన అన్నారు. ఇది చివరకు ఏ దిశలో పయనించేదీ ఓపిగ్గా వేచి చూడాల్సిందే. కానీ మోడీ మాత్రం ఈలోగానే ఏదో జరిగిపోతుందనీ అందరి ఆస్తి పోతుందని గగ్గోలు పెడుతున్నారు. శ్యామ్ పిట్రోడా ఇతర వీడియోలు కూడా తవ్వి తీస్తున్నారు. ఇంత చేసి పిట్రోడా ఇప్పుడేమీ కాంగ్రెస్‌తో లేరు. అసలు క్రియాశీల రాజకీయవేత్త కాదు. అయినా బిజెపికి జనాన్ని కంగారు పెట్టే ఏదో అంశం కావాలి కదా!

సకల వర్గాల్లో ఆందోళన

ఆస్తిక వాదమంతా తమదేనని మత రాజకీయాలు నడిపే బిజెపి ఆస్తి విషయాల వైపు రావడం యాదృచ్ఛికమేమీ కాదు. అంతెందుకు? ముస్లింలకు ఆస్తి ఇస్తారంటూ మొదటి రోజు చెప్పిన మోడీ దానిపై విమర్శలు వచ్చాక కూడా మార్చుకోకపోగా హనుమాన్ జయంతి రోజున హనుమాన్ చాలీసా చదవనివ్వడం లేదని కొత్త ఆరోపణ చేశారు. ఇక్కడ విశేషం వుంది. నరేంద్ర మోడీని 'నమో' అంటుంటారు భక్తులు. నిజానికి నమో నమ:శివాయ అనేది శివభక్తులు వాడేది. కానీ కాశీలో పోటీచేసి గెలిచిన మోడీకే ఆ విశేషం తగిలించేశారు. అలాగే హనుమాన్ చాలీసా తరహాలో మోడీ చాలీసా కూడా రచించారు! ఆయన వ్యక్తి ఆరాధన అంత ఎత్తుకు తీసుకుపోవడం సంఘ పరివార్ వ్యూహంలో భాగమే. అయితే రాను రాను ఈ ప్రభ మసకబారిందని వారు గ్రహించక తప్పలేదు. మరే సమస్య లేనట్టు మోడీ పేరే ఊపేస్తుందన్న భావం కరిగిపోయింది. మతాన్ని, రాజకీయాలను కలిపే పాత పాచికలూ పారడం లేదు. స్థానిక నాయకులైనా జాతీయంగా మోడీ సరిపోతాడన్న ప్రచారం కర్ణాటక నుంచి చాలా చోట్ల వీగిపోయింది. అనేక అంశాలలో కేంద్ర నిరంకుశత్వం వారి గడపలను తాకింది. ఈ సమయంలో మోడీ సభలకు, చిట్కాలకు అసలు



స్పందన తగ్గిపోతోంది. వివిధ పార్టీల కీలక నాయకులను అసలు బిజెపిలోనే స్థానికంగా పట్టుబడిన నేతలను కూడా తోసిరాజన్న మోడీ ధోరణిని వారు ఆమోదించలేకపోతున్నారు. చాలా సర్వేలలో సంకేతాలు వచ్చినట్టు నిరుద్యోగం, ధరల పెరుగుదల, దారిద్ర్యం ప్రజలను ఎంతగానో కలవరపెడుతున్నాయి. వ్యవసాయ రంగానికి మరో సమస్య. మీడియా, విద్యాలయాలు, మేధావి వర్గాలు, స్వచ్ఛంద సంస్థలు, న్యాయవ్యవస్థ, కవులు, రచయితలు, ఆఖరుకు సినిమా రంగం కూడా మోడీ హయాంలో ముదిరిపోయిన ఏకపక్ష ఆధిపత్యానికి గురికాక తప్పలేదు. రాజకీయ సేవలో మతాన్ని వాడుకోవడం కోసం మోడీ మతాచార్య పాత్రనూ తనే లాగేసుకోవడంతో అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ట ఒక వివాదంగా మారింది. ఇక ఆరుగాలం శ్రమ పడే రైతుల ఆగ్రహావేదనలు ఆందోళనగా ప్రజ్వరిల్లి దేశాన్ని ప్రతిష్టంభనకు గురిచేశాయి. ఈ సమయంలో కాశ్మీర్ 370, సరిహద్దులలో ఉద్రిక్తతలు, సర్జికల్ స్ట్రయిక్స్ వంటి ఊపునిచ్చే వాతావరణం మారుతోంది. మోడీని త్రీడీలో చూపిన ప్రచార పొర కూడా కరిగిపోతున్న దశ. అన్ని చోట్లా అన్ని వేదికల్లో ఆయనే ప్రత్యక్షమై ప్రబోధకుడుగా ప్రభవించడం, ప్రజలు ఆమోదించడం బాగా తగ్గింది. బిజెపిలోనూ సంప్రదాయ నాయకత్వం శ్రేణులు ఎదురు తిరగడం మొదలుపెట్టారు. ఎ.పి, తెలంగాణలలోనే బిజెపి శిబిరాలు గమనిస్తే వాస్తవం తెలుస్తుంది. ఆ పార్టీ పెద్ద శక్తిగా లేని చోట్లనే వుంటే ఒక పునాది గల చోట్ల నాయకులు, సీనియర్ కార్యకర్తలు, ఇలా అభిమానులు ఎలా స్పందిస్తారో తేలిగ్గా ఊహించవచ్చు. రెండు మూడు సార్లు ముఖ్యమంత్రులైన వారితో సహా బడిపిల్లల్లా బందిఖానాలకు పంపిస్తే ఎన్నుకున్న ప్రజల్లోనూ ప్రతికూలత రావడం సహజం. ఇక ఆయనను ఆశ్రయించుకున్న వర్గాలేమో అదానీ అయినా, రామదేవ్ బాబా అయినా రకరకాలుగా దొరికిపోతున్న దశ. మోడీపై మోహం మొత్తడమేగాక నిరాసక్తత, నిరసన కూడా పెరగడానికి ఇవన్నీ కారణమైనాయి.

చంద్రబాబు వింత లెక్కలు

